




# మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

బుధవారం 10 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2







## రూ.20 లక్షల విలువైన 102 మొబైళ్ల రికవరీ







**-మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్పీ నరసింహ**

భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం

జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన సుమారు రూ.20 లక్షల విలువైన 102 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు జిల్లా ఎస్పీ నరసింహ అందజేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సెల్‌ఫోన్ రికవరీ మేళాలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకుని పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు లోనై మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని హెచ్చరించారు. గత ఏడాదిలో జిల్లాలో మొత్తం 1,744 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. మొబైళ్లు తిరిగి పొందిన బాధితులు జిల్లా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఐటీ కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, సైబర్ వారియర్స్, పోలీసు సిబ్బంది, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.






## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా బండారు రాజా నియామకం

భానుపురి /హైదరాబాద్



సూర్యాపేట పట్టణానికి చెందిన బండారు రాజా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు గతంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం జిల్లా ఆర్యవైశ్య మహాసభ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బండారు రాజా మాట్లాడుతూ నాపై నమ్మకముతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యక సభ్యులుగా నియమించిన అమరవాది లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియామకమైన సందర్భంగా శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

## బడిబాటలో 20 శాతం అదనపు నమోదు సాధించాలి

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్



జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల నమోదును కనీసం 20 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో జీరో ఎన్రోల్మెంట్ విద్యార్థులు లేని కారణంగా మూతపడిన పాఠశాలలను గుర్తించి, ఈ విద్యా సంవత్సరం నుండి వాటిని పునఃప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన 91 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్లను, ఆయాలను త్వరితగతిన నియమించాలన్నారు. విస్తృత ప్రచారం నిర్వహించి ఈ కేంద్రాలలో చిన్నారులను పెద్ద సంఖ్యలో చేర్పించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ర్యాంపులు, వెస్ట్రన్ టాయిలెట్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఇప్పటికే మంజూరైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్లు, కంప్యూటర్లు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని, ఇంటర్నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి, డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రాధాన్యత అని అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి బడిబాటను విజయవంతం చేయాలని కోరారు. ఈ వెబెక్స్ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, రేణుక దేవి, పూలన్, వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు మరియు విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి విద్యావ్యవస్థ ప్రధానం

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్



సమాజం గాడి తప్పకుండా అభివృద్ధి దిశలో పయనించాలంటే దానికి విద్య వ్యవస్థ మూలమని, అలాంటి విద్యా వ్యవస్థ ఉపాధ్యాయులు, ఆధ్యాపకుల చేతిలో ఒక ఆయుధం లాగా ఉన్నదని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉద్బోధించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధ్యాపకులు పాత పద్ధతిలో కాకుండా నూతన రీతులలో యువతను మేల్కొల్పి, పిల్లలు ఆకట్టుకునేలా పాఠాలు బోధించి వారిని ఉన్నత స్థితిలో నిలపాలని సూచించారు. ఒక తరం నుంచి మరో తరానికి మార్పు అనేది అది ఉపాధ్యాయుల చేతిలో ఉంటుందని గుర్తు చేశారు. విద్యార్థుల జీవితాలను రూపకల్పన చేసే అదృష్టం ఉపాధ్యాయ లోకానికి ఉంటుందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు అభ్యసిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ప్రతి ఒక్కరు సంకల్పంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఏఐ, ఆన్లైన్ కోర్సెస్, ఫిజిక్స్ వాలా తదితర ఇన్నోవేషన్ విధానంలో బోధన ఉండాలన్నారు. ఇంటర్లో ఫలితాలు తగ్గిన దాని గురించి కాకుండా భవిష్యత్తులో ఎలాంటి ప్రణాళికతో ముందుకు సాగుతారనేది ఆలోచించాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు సంకల్పంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ కళాశాల కంటే ప్రభుత్వ కళాశాలలోనే అధ్యాపకులకు, విద్యార్థులకు ఎక్కువ నైపుణ్యం ఉంటుందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు. ఆయా కళాశాల వారీగా గత సంవత్సరం ఫలితాలపై అధ్యాపకులతో చర్చించి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. డిఐఈఓ బి. సులోచన రాణి మాట్లాడుతూ గత సంవత్సరం మొదటి సంవత్సరంలో 60.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 66.83 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు వివరించారు. ఈ విద్యా సంవత్సరం మరింత ఉన్నతమైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాల ప్రిన్సిపల్ పి. యాదయ్య, రాజమోహన్, వెంకట రమణ రెడ్డి, విజయ నాయక్, హరిప్రసాద్, గీతాబాయి, మృత్యుంజయ, వెంకటరమణ లతోపాటు ఆయా కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా కక్కిరేణి చంద్రశేఖర్ నియామకం

భానుపురి /హైదరాబాద్



సూర్యాపేట పట్టణానికి చెందిన కక్కిరేణి చంద్రశేఖర్ తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు ప్రస్తుతం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కక్కిరేణి చంద్రశేఖర్ మాట్లాడుతూ నాపై నమ్మకముతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యక సభ్యులుగా నియమించిన అమరవాది లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియామకమైన సందర్భంగా శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తో పాటు పలువురు ఆర్య వైశ్యులు అభినందనలు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ విభాగం ఉపాధ్యక్షునిగా గరినే శ్రీధర్ నియామకం

భానుపురి /హైదరాబాద్



కోదాడ పట్టణానికి చెందిన గరినే శ్రీధర్ తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ విభాగం ఉపాధ్యక్షులుగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు గతంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పట్టణ కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నాపై నమ్మకముతో నియమించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ కు నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావుకు జిల్లా మాజీ అధ్యక్షులు మా శెట్టి అనంత రాములు కు ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థుల్లో పఠన, లేఖన నైపుణ్యాలు పెంపొందించాలి

భానుపురి/సూర్యాపేట కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు చేయాల్సి నటువంటి కార్యక్రమాల గురించి మంగళ వారం ఇంగ్లీషు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించడం జరిగింది. దీనిలో ఆంగ్ల ఉపాధ్యాయుల యొక్క సూచనలని పరిగణలోకి తీసుకొని కలెక్టర్ విద్యార్థులు ఆయా వారి స్థాయికి తగినటువంటి పుస్తకాలను చదవటం రాయటం అనే నైపుణ్యాలని తప్పకుండా పొందాలని సూచించారు. దీనికోసం 60 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు ప్రతిరోజు ఉపాధ్యాయుడు ఆయా తరగతిలోని విద్యార్థుల అందరి చేత పాఠాలని చదివించడం అలాగే రాయించడం కూడా చేయాలి మొదటి 30 రోజులు పఠన నైపుణ్యాలను పెంపొందించాలని ఆ తర్వాత 30 రోజులు లేఖన నైపుణ్యాలని పెంపొందించాలని సూచించారు. ప్రతినెల జరిగే కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ పెంచడానికి ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చాలని నిర్వహించాలని అలాగే ఆన్లైన్ కోర్సులు చేయడానికి ఆసక్తి ఉన్నటువంటి ఉపాధ్యాయులకి అవకాశాలను కల్పిస్తామని అలాగే జాలి గ్రామర్ వంటి శిక్షణ కార్యక్రమాలను ఉపాధ్యాయులకు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలోని పిల్లలందరి చేత చదవడం రాయడం అనేది తప్పనిసరిగా చేయాలని దీనికి ఆధారాలు కూడా ఉండాలని దీనికోసం ఉపాధ్యాయులంతా కృషి



చేయాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులంతా చక్కగా చదవడం రాయడం నేర్చుకుంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ హరికృష్ణ, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయుల తరఫున సుధీర్ రెడ్డి, పబ్బతి వెంకటేశ్వర్లు, గురు చరణ్, పఠాన్ ఖాన్, పద్మశ్రీ అరుంధతి షహనాజ్ మొదలైన వారు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలు ఉన్న ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించిన పట్టణ పోలీసులు






భానుపురి/సూర్యాపేట టౌన్..

జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు మంగళ వారం సూర్యాపేట పట్టణంలో 60 ఫీట్ల రోడ్డు, ఇతర ప్రాంతాల్లో పాఠశాలలుకళాశాలలు ఉన్న ప్రాంతాలలో దుకాణాల నందు పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించినపోలీసు సిబ్బంది దుకాణ నిర్వాహకులకు విద్యాసంస్థలు ఉన్న ప్రాంతంలో దుకాణాల నందు మత్తు పదార్థాలకు సంబంధించిన పొగాకు ఉత్పత్తులు కానీ ఇతర పదార్థాలు కానీ అమ్మ వద్దు అని తెలియజేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మీడియా విభాగం వైస్ చైర్మన్ గా వంగవీటి శ్రీనివాసరావు నియామకం



భానుపురి/హైదరాబాద్

కోదాడ పట్టణానికి చెందిన వంగవీటి శ్రీనివాసరావు (వార్త) తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మీడియా విభాగం వైస్ చైర్మన్ గా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు ప్రస్తుతం జిల్లా ఆర్యవైశ్య మీడియా విభాగం చైర్మన్ గా టి యు డబ్ల్యు జే 143 నియోజకవర్గ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకముతో నియమించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ కు నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు కు జిల్లా మాజీ అధ్యక్షులు మా శెట్టి అనంత రాములు కు ధన్యవాదాలు తెలిపారు

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రత్యేక ఆహ్వానితులుగా మంచాల రంగయ్య నియామకం

భానుపురి/హైదరాబాద్



సూర్యాపేట పట్టణానికి చెందిన మంచాల రంగయ్య తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ప్రత్యేక ఆహ్వానితులుగా మంగళవారం నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. వీరు పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా పనిచేశారు. ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వాల సేకరణలో ముందుండి పనిచేశారు. ఈ సందర్భంగా మంచాల రంగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకముతో నియమించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ కు ధన్యవాదాలు తెలిపారు. వీరి నియామకం పట్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు బచ్చు పురుషోత్తంతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్

దేశంలో పెరుగుతున్నటువంటి పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ధర్మ బిక్షం భవనంలో సిపిఐ చలో కలెక్టరేట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే యుద్ధం కారణంగా నిత్యవసర వస్తువులు ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద మధ్యతరగతి ప్రజలపై పెట్రోల్ లీటర్ కి పది రూపాయలు డీజిల్ పై పది రూపాయలు గ్యాస్ పై 70 రూపాయలు పెంచడం అత్యంత దుర్మార్గం అన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. ఒకపక్క విద్యార్థులు యువజనలకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ




మోసగిస్తున్నారని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈరోజు జరిగే సిపిఐ కలెక్టరేట్ ధర్నాకు పెద్ద ఎత్తున యువజనులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బూర సైదులు,గౌరవ అధ్యక్షులు కుక్కడపు శౌరి, అయితగాని కామేష్, రెడ్డి మల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా భరోసాగా నిలుస్తున్న టీయూడబ్ల్యూజే ఐజేయు

భానుపురి/సూర్యాపేట టౌన్



జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తూ, అర్ధ శతాబ్దానికి పైగా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే–ఐజేయూ అని, సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ నమోదులో టీయూడబ్ల్యుజే ఐజేయు దూసుకుపోతుందని టి యు డబ్ల్యు జే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. టీయూడబ్ల్యూజే–ఐజేయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వార్త దినపత్రిక జిల్లా బ్యూరో శిగ సురేష్ గౌడ్ కు సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో తనకంటూ ఒక గుర్తింపును పొంది అనేక సంచలన కథనాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచి ప్రజల సమస్యలపై ఎన్నో మంచి కథనాలను అందించిన శిగ సురేష్ గౌడ్ కు యూనియన్ లో తగు ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. పాలకులు ఎవరైనా జర్నలిస్టుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాడే సంఘం టీయూడబ్ల్యూజే ఐజేయూ మాత్రమేనని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించే శిక్షణా తరగతులను త్వరలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## మహిళా సాధికారత దిశగా ముందడుగు

భానుపురి /సూర్యాపేట టౌన్



మహిళా అభ్యున్నతి, ఆర్థిక సాధికారత ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకం సరికొత్త మైలురాయిని అందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్టీసీ బస్సులను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 553 బస్సులను కేటాయించగా, సూర్యాపేట జిల్లాకు 23 బస్సులను ప్రభుత్వం పంపిణీ చేసింది. స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బస్సుల నిర్వహణ బాధ్యతలను మహిళా సమాఖ్యలకు అప్పగిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 828 లక్షలను మంజూరు చేసింది. ప్రతి మండల సమాఖ్యకు రూ. 36 లక్షల చొప్పున నిధులను కేటాయించారు. ఈ బస్సుల నిర్వహణ ద్వారా ప్రతి మండల సమాఖ్యకు నెలకు రూ. 69,468 ఆదాయం సమకూరనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా సంఘాలకు నేరుగా రవాణా రంగంలో భాగస్వామ్యం కల్పించడంపై జిల్లా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సుల ఈ పథకం మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.